సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 2 । జనవరి । 2025



పేదలకు ఆరోగ్యశ్రీ దూరం..!

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రస్తుతం ఆరోగ్య భరోసా కరువైంది. ఆరోగ్యశ్రీ సేవలు దూరమవుతున్నాయి. - 8లో



పైసలు కొట్టు.. విద్యుత్ మీటరు పట్టు..!

విద్యుత్ శాఖ అధికారులు పెట్టే ముప్పతిప్పలు తట్టుకోలేక వినియోగదారులు వారు అడిగినంత ముట్టజెప్పుతున్నారు. - 8లో



ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు

- 8లో

పోలీసుశాఖ ముందస్తు చర్యలతో న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

న్యూస్‌రీల్

5న సాలూరులో జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల వయస్సుగల యువత జాబ్ మేళాకు అర్హులన్నారు. 10, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదువుతున్న యువతకు 25 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల యువత హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదుచేసి రిఫరెన్సు నంబర్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్సులతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 94947 77553, 73825 59022 నంబర్లను సంప్రదించాలన్నారు.

మొదటి సంతకం అమలు కోసం పోరాటం

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటి సంతకమైన డీఎస్సీ నోటిఫికేషన్, గిరిజన మంత్రి మొదటి సంతకం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎమ్‌ల నియామకం జరిగేలా కొత్త సంవత్సరంలో పోరుబాట సాగిస్తామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజీత్ కుమార్ తెలిపారు. గిరిజన హక్కులు, ఐటీడీఏ మనుగడ, గిరిజన సంక్షేమం కోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు జిల్లా అధికారులు, ఉద్యోగులు బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలని, అన్ని రంగాల్లో జిల్లా పురోభివృద్ధికి సహకరించాలని ఉద్యోగులకు కలెక్టర్ సూచించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్‌సీసీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, డీఈఓ డా.ఎస్.తిరుపతినాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి, వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, పశుసంవర్ధకశాఖాధికారి మన్మథరావు, మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, పీఆర్ ఈఈ వి.వి.నగేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీల చించివేత



కురుపాం మండల కేంద్రంలో చించివేతకు గురైన ఫ్లెక్సీలు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని కురుపాం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. దీనిపై పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఫ్లెక్సీలు చించివేయడం పిరికిపంద చర్యగా పేర్కొన్నాయి. ఇలాంటి సంస్కృతి కొనసాగితే సహించేది లేదని హెచ్చరించాయి.

ఉద్యోగాల్లో కొనసాగించాలి

• మహిళల ఆందోళన

తగరపువలస: విజయనగరం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 170 మంది మహిళలు బుధవారం ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం స్రింట్ సీ ఫుడ్స్ సంస్థ ముందు ఆందోళన చేపట్టారు. పదేళ్ల నుంచి పనిచేస్తున్న తమను అకారణంగా ఉద్యోగాల నుంచి తొలగించారని వారు ఆరోపించారు. నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో మాట్లాడేందుకు మహిళలు ప్రయత్నం చేయగా.. సిబ్బంది అనుమతించలేదు. దీంతో గేటు ముందు బైఠాయించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఆనందపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను మాట్లాడించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది.



నత్తనడకన సాగుతున్న సాలూరులోని వందపడకల ఆస్పత్రి నిర్మాణం

నాటి పురోగతి.. ఆగితే అధోగతి..!

గిరిజన గూడలకు పక్కా రోడ్లు.. విద్యార్థులకు సకల సదుపాయాలతో నాడు–నేడు అనేలా నిర్మించిన పాఠశాల భవనాలు.. ఆరోగ్య భరోసా కల్పించేలా ఆస్పత్రులు.. రైతన్నకు సాగుదన్నుగా నిలిచేలా పెట్టుబడి సాయం, ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు.. గిరిజన విద్యార్థులకు చేరువగా ఇంజినీరింగ్ కళాశాల.. ప్రతి విద్యార్థిని విజేతగా నిలిపే విద్యా సంస్కరణలు.. మన్యం వాసులకు డిజిటల్ సేవలు చేరువయ్యేలా సెల్‌టవర్ల నిర్మాణం.. ఇలా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త జిల్లా పురోభివృద్ధికి అనేక చర్యలు చేపట్టింది. ఇప్పుడు ఇవి ఆగితే అధోగతి తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తీపి, చేదు జ్ఞాపకాలను మిగిల్చిన 2024 సంవత్సరం కాలగమనంలో కలిసిపోయింది. కొత్త సంవత్సరం ఆరంభమైంది. కనీసం ఈ ఏడాది అయినా టీడీపీ కూటమి నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌ను పక్కనపెట్టి.. ఇచ్చిన హామీలు నెరవేర్చుతారని.. అభివృద్ధి పనులు కొనసాగిస్తారని జిల్లా ప్రజానీకం ఆశగా ఎదురుచూస్తోంది. – సాక్షి,పార్వతీపురం మన్యం

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లా ఆవిర్భావం తర్వాత.. వెనుకబడిన ప్రాంతం అనే ముద్రను చెరిపేసేందుకు శరవేగంగా అడుగులు పడ్డాయి. గిరిజన జనాభా అధికంగా ఉండటం.. వనరులు కూడా తక్కువే కావడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకనుగుణంగానే.. ఈ ప్రాంతంలో ఎన్నడూ లేని అభివృద్ధిని ఇక్కడి ప్రజలు చూడగలిగారు. ఈ ప్రాంత విద్యాభివృద్ధికి కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల.. ఉమ్మడి జిల్లా పరిధిలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం.. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి.. ప్రభుత్వ వైద్య కళాశాల, సీతంపేటలో ఆస్పత్రి.. ఇలా ఎన్నో మౌలిక సదుపాయాలు చేరువయ్యాయి. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. ఆ దిశగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. అంతేకాదు.. డోలీల మోత తప్పించేందుకు గిరి శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించింది. కారణాలేవైతేనేం.. ప్రభుత్వం మారడంతో పనులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందాన ఉండిపోయాయి. దాదాపు ఏడు నెలలుగా అభివృద్ధి పనుల్లో పురోగతి కుంటుపడింది. కొత్త సంవత్సరంలోనైనా తిరిగి పట్టాలెక్కించాలన్నది జిల్లా ప్రజల ఆకాంక్ష. హామీల అమలుతో పాటు అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరుతోంది.

వైద్యకళాశాల నిర్మితమయ్యేనా?

ప్రతి పేదవానికీ మెరుగైన వైద్యం కోసం వైద్యసేవలన వారి ముంగిటకే తీసుకొచ్చింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఇక్కడి ప్రజల వైద్య అవసరాలకు అనుగుణంగా పార్వతీపురంలోని ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా స్థాయి పెంచింది. గతంలో వంద పడకలున్న ఆస్పత్రిని 150 పడకలుగా మార్పు చేసింది. అధునాతన వైద్య సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చింది. స్పెషలిస్టు పోస్టులను భర్తీ చేశారు. పార్వతీపురం, సీతంపేటల్లో రూ.50 కోట్ల చొప్పున వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరైంది. మొదట్లో ఆస్పత్రి పనులు శరవేగంగా జరిగినా.. ప్రస్తుతం మందగించాయి. జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల అని ప్రకటించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. అందుకనుగుణంగానే మన్యం జిల్లాకు రూ.600 కోట్లతో కళాశాల నిర్మాణానికి సంకల్పించింది. తర్వాత ప్రభుత్వం మారడంతో.. ఇప్పుడు వైద్య కళాశాల సందిగ్ధంలో పడింది. సాలూరు ప్రజల చిరకాల కల అయిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో జోరుగా సాగింది. ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి.

మార్గం సుగమం చేయాలి

- డోలీల మోత తప్పించేందుకు పార్వతీపురం, సీతంపేట ఐటీడీల పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో గిరిశిఖర గ్రామాలకు బీటీ రహదారులను గత ప్రభుత్వం నిర్మించింది. ఒక్క పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోనే సుమారు రూ.10,028.26 లక్షలకుపైగా వెచ్చించి 84 రహదారులను పూర్తి చేసింది. పీఎంజీఎస్‌వై, ఆర్‌సీఈపీఎల్‌డబ్ల్యూ గ్రాంట్ల కింద 1,008 రహదారి పనులను రూ.1,260 కోట్లతో చేపట్టింది.
- సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో మారుమూల, గిరిజన ప్రాంతాలకు సిగ్నల్ సమస్యలను పోగొట్టేందుకు రూ.200 కోట్లకుపైగా వెచ్చించి.. 196 సెల్‌టవర్లకు గత ప్రభుత్వంలో ఆంకురార్పణ చేశారు. ప్రస్తుతం 23 వరకు టవర్లు ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. వీటిని కూడా కూటమి ప్రభుత్వం పూర్తిచేయాల్సి ఉంది.
- నాడు–నేడుతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. తొలిదశలో 486 పాఠశాలల్లో రూ.130.14 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. రెండో విడతలో రూ.144.51 కోట్లతో 535 పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలనూ అభివృద్ధి చేసేందుకు సిద్ధమయ్యారు. గత ఆరు నెలలుగా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నాడు–నేడు కింద చేపట్టిన పాఠశాలల భవనాలు.. సాలూరు వంటి ప్రాంతాల్లో పశువులు కట్టేందుకు ఉపయోగిస్తుండటం ఆందోళన కలిగించే అంశం.



సాలూరులో పశువుల కొట్టంగా మారిన పాఠశాల భవనం



కురుపాంలోని టేకరికండిలో నిర్మాణం పూర్తికావాల్సిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల భవనం

ఇంజినీరింగ్ విద్య అందేనా?

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని చిట్టచివరి నియోజవర్గమైన కురుపాం ప్రాంతంలోని విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే ఇప్పటికే ఇంజినీరింగ్ విద్య అందుబాటులోకి వచ్చేదన్నది ఈ ప్రాంత ప్రజల మాట. గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను అందించాలన్న అప్పటి డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి విజ్ఞప్తి మేరకు అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రూ.153.85 కోట్లు మంజూరు చేశారు. కురుపాం నియోజకవర్గ కేంద్రానికి కూతవేటు దూరంలోని టేకరికండిలో 106 ఎకరాల స్థలంలో ఇంజినీరింగ్ భవనాల నిర్మాణ పనులకు 2020 అక్టోబర్ 2న వర్చువల్ విధానంలో జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 70 శాతం పనులు పూర్తిచేశారు. మరి కొద్ది రోజుల్లో పనులు పూర్తయి గిరిజనులకు గిరిజన ఇంజినీరింగ్ చదువులు అందుబాటులోకి వస్తాయని ఆశించిన సమయంలో ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఈ భవన నిర్మాణ పనులపై దృష్టిసారించి ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తేవాలని గిరిజన విద్యార్థిలోకం కోరుతోంది.

ఉద్యోగుల ఆశల సౌధం నిర్మితం కావాలి..



- కొత్త జిల్లాలో రూ.100 కోట్లతో సమీకృత కలెక్టరేట్ సముదాయం నిర్మాణానికి గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడ్డాపుశీలలో నిర్మించాలని 59.80 ఎకరాల భూమిని కేటాయించారు. ప్రస్తుతం ఆ ఊసే వినిపించడం లేదు. ఇది నిర్మితమైతే ఉద్యోగుల విధుల నిర్వహణకు అనువుగా ఉంటుంది. ప్రజలకు మెరుగైన సేవలందించే అవకాశం కలుగుతుంది.
- ప్రస్తుత ఖరీఫ్‌కు సీజన్‌కు సంబంధించి రైతుకు పెట్టుబడి భరోసా దక్కలేదు. కూటమి ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలలో ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. గత ఐదేళ్లలో ఏడాదికి సగటున రూ.1.45 లక్షల మంది రైతులు.. రూ.196 కోట్ల మేర లబ్ధి పొందేవారు. కొత్త సంవత్సరంలోనైనా ప్రస్తుత ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా అమ్మ ఒడి లబ్ధిని అందించేది. ఏడాదికి జిల్లాలో దాదాపు 97,761 మంది విద్యార్థులు రూ.146.64 కోట్ల మేర లబ్ధి పొందేవారు. తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరిట కుటుంబంలో చదువుకున్న పిల్లలు ఎంత మంది ఉంటే.. అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. గత విద్యా సంవత్సరంలో రూపాయి కూడా ఇవ్వలేకపోయింది. ఈ విద్యాసంవత్సరంలోనైనా నిధులు విడుదల చేస్తారని తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



శాశ్వత పరిష్కారం లభించేనా?

తోటపల్లి, జంఝావతి, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్ తదితర సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ కోసం ఎదురుచూస్తున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో తోటపల్లికి రూ.38 కోట్ల మేరనే కేటాయించింది. వాస్తవానికి ఈ ఒక్క ప్రాజెక్టుకే రూ.700 కోట్లు వరకు అవసరం.



హామీ నెరవేరేనా?

ఏనుగుల సమస్యతో ఇప్పటికే 13 మంది వరకు మృతి చెందారు. గజరాజులూ ప్రాణాలు కోల్పోయాయి. రైతులు కోట్లాది రూపాయల విలువ చేసే పంట, ఆస్తులను కోల్పోయారు. కుంకీ ఏనుగులు తెప్పిస్తామన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ.. ఇప్పటి వరకు నెరవేరలేదు. ఈ ఏడాదిలోనైనా అది నెరవేరాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడో?

అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీపైనే సీఎం చంద్రబాబునాయుడు చేశారు. ఏడు నెలలుగా అది కాస్తా దగా డీఎస్సీగా మిగిలిపోయింది. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తారని జిల్లాలో వేలాది మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 446 పోస్టుల వరకు భర్తీ చేయాల్సి ఉంది. కనీసం కొత్త సంవత్సరంలోనైనా నోటిఫికేషన్ జారీచేస్తారా? లేదా? అన్న సందిగ్ధత అభ్యర్థుల్లో నెలకుంది.



నిర్మాణంలో ఉన్న సీతంపేట సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

మన్యం ప్రజలకు మల్టీస్పెషాలిటీ వైద్యం

సీతంపేట: సీతంపేటకు గత ప్రభుత్వం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేసింది. దీనికోసం రూ.50 కోట్లు కేటాయించింది. మరోవైపు సీతంపేట ఏరియా ఆస్పత్రికి అదనపు భవనాల నిర్మాణం కోసం రూ.20లక్షలు వెచ్చించింది. ఇవి పూర్తయితే పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందనున్నాయి.

ప్రణాళిక పారాలి.. ఫలితాలు రావాలి

- గత రెండేళ్లుగా పదోతరగతి ఫలితాల్లో మన్యం ముందంజ
- ఈ ఏడాది గురుకుల పాఠశాల గురువుల సమ్మెతో పూర్తికాని సిలబస్
- ఆందోళనలో విద్యార్థిలోకం
- శతశాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ దిశానిర్దేశం



వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్టడీ అవర్స్‌లో పదోతరగతి విద్యార్థులు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా గత రెండేళ్లు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. ఏప్రిల్–2023 టెన్త్ ఫలితాల్లో 87.47 శాతం, ఏప్రిల్–2024 టెన్త్ ఫలితాల్లో 96.37 శాతంతో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ముచ్చటగా మూడోసారి మార్చి 2025లో జరగనున్న టెన్త్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించాలని జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే, ఓ వైపు గత 40 రోజులుగా పైగా జిల్లాలోని గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టడం, గిరిజన గురుకులాల్లో టెన్త్ క్లాస్ సిలబస్ పూర్తికాకపోవడం ప్రతిబంధకాలుగా కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ విద్యపై టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడం, విద్యార్థులకు కావాల్సిన వసతులు సమకూర్చకపోవడం ఫలితాలపై పడే సూచనలు కనిపిస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది. కలెక్టర్ శ్యామప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఉపాధ్యాయుల కృషి కలిసొచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి.

దిశానిర్దేశం ఇలా..

గత రెండేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఇటీవల వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. సబ్జెక్టు టీచర్లు, విద్యాశాఖ అధికారులకు ఈ ప్లాన్ వివరించారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి జరగనున్న పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టులలో సందేహాలను నివృత్తిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాయనున్న 10,802 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా బోధన సాగించాలని దిశానిర్దేశం చేశారు. ఇది రెండు నెలలపాటు పక్కాగా అమలైతే చక్కని ఫలితాలు వచ్చే అవకాశం ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం



గత రెండేళ్లలో సాధించిన టెన్త్ ఫలితాలను పునరావృతం చేసేందుకు ప్రస్తుతం టెన్త్ విద్యార్థులకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. ప్రతిరోజు స్లిప్ టెస్టుల నిర్వహణ, వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల బోధన, ఆదివారం కూడా సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

– ఎన్.తిరుపతినాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి, పార్వతీపురం మన్యం

● న్యూ ఇయర్ గమ్మత్తు

రూ.17 కోట్లు తాగేశారు..



ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మందుబాబులకు కొత్త ఏడాది ఫుల్ కిక్ ఇచ్చింది. డిసెంబర్ 31, జనవరి ఒకటో తేదీన రూ.17 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు సాగాయి. కొత్త ఏడాదిని పురస్కరించుకుని మందుబాబుల తాకిడితో లిక్కర్ షాపులు కిక్కిరిశాయి. డిసెంబర్ 31న ఒక్కరోజే విజయనగరం జిల్లాలో రూ.7 కోట్ల 21 లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.2 కోట్ల 16 లక్షల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. జనవరి ఒకటో తేదీన నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లాలో సుమారు రూ.6 కోట్ల 50 లక్షలకు పైబడి, పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు రూ.కోటీ 50 లక్షలకు పైగా మద్యం అమ్మకాలు జరిగినట్టు ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు.

– పార్వతీపురం టౌన్

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు బుధవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నూతన సంవత్సరం కావడంతో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశిష్ట కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

బంగారు అభరణాలు స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్సై నారాయణరావు

గుర్ల: మండలంలోని పెనుబర్తికి చెందిన సుంకరి రాము ఇంట్లో సోమవారం దొంగతనం జరిగింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై నారాయణ రావు దొంగతనంపై పూర్తి విచారణ చేసి నిందితుడిని పట్టుకుని బుధవారం అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వ్యక్తి దగ్గర నుంచి మూడుంపావు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రెండు రోజుల్లో కేసు విచారణ పూర్తి చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంతో ఎస్సై నారాయణ రావు, పోలీస్‌సిబ్బందిని సీఐ శంకరరావు అభినందించారు.

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రేపు



డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: ఈనెల 3వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) జిల్లా కేంద్రంలోని డీవీఎంఎం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లావ్యాప్తంగా ఉన్న 15 మండలాల నుంచి ఎంపికైన దాదాపు 45 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇందులో సైన్స్ క్విజ్ పోటీలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో సరికొత్త విద్యా, వైజ్ఞానిక అంశాలను ప్రదర్శించేందుకు సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ కోరారు.

లారీ ఢీకొని సైక్లిస్ట్ మృతి



లక్ష్మునాయుడు మృతదేహం

గజపతినగరం: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద లారీ ఢీకొట్టిన సంఘటనలో ఓవ్యక్తి మృతి చెందాదు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గజపతినగరం మండలం గంగచోళ్ల పెంట గ్రామానికి చెందిన పెయింటర్ కనకల లక్ష్మునాయుడు (44) సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లీల, డిగ్రీ చదువుతున్న కుమారుడు చాణక్య ఉన్నారు. సమాచారం మేరకు స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

సంవత్సరం	ఆరోగ్యశ్రీరోగుల సంఖ్య	వెచ్చించిన నిధులు
2019-20	31,357	రూ.73.06 కోట్లు
2020-21	35,776	రూ.84.69 కోట్లు
2021-22	62508	రూ.123.59 కోట్లు
2022-23	61053	రూ.123.61 కోట్లు
2023-24	65374	రూ.126.75 కోట్లు



ఆరోగ్యశ్రీనెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు

- ఆ స్థానంలో బీమా కంపెనీని తీసుకువచ్చే ప్రయత్నం
- పథకంలో 3257 వ్యాధులకు చికిత్స

పేదలకు ఆరోగ్యశ్రీ దూరం..!

విజయనగరం ఫోర్ట్:



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎస్.సత్యం. ఇతనిది విజయనగరం మండలం కోరుకొండ పాలెం గ్రామం. ఈ వ్యక్తికి కంటి శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ప్రభుత్వం సర్వజన ఆస్పత్రిలో చేసింది.



ఈ వ్యక్తి పేరు ఎస్. సత్యనాసయ్య. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. ఇతని అమ్మకి సెల్యూలైటిస్ రావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఇతని అమ్మ ఆరోగ్యం బాగానే ఉంది.

ఇలా వీరిద్దరికే కాదు. అనేక మందికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్‌వైద్య సేవ) పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రెండులక్షలకు పైగా ప్రజలు ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.537 కోట్ల వరకు వెచ్చించింది. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు కార్పొరేట్ ఆస్పత్రులు సైతం పిలిచి మరీ వైద్యం చేసేవి. అటువంటి బృహత్తర ఆరోగ్య శ్రీ పథకాన్ని పేదలకు దూరం చేసే కుట్రను కూటమి సర్కార్ చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం స్థానంలో బీమా కంపెనీని తెచ్చే ప్రయత్నంలో కూటమి సర్కార్ ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే రోగుల ఆరోగ్యానికి భద్రత కరువవుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ



నెట్ వర్క్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య మిత్రలు

పథకం ద్వారా జిల్లాలో 3257 వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. అయితే వ్యాధుల సంఖ్యను కూడా కూటమి ప్రభుత్వం పెంచే ఆలోచన చేయలేదు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల్లోనూ ఆందోళన

ఆరోగ్యశ్రీ రోగులతో పాటు ఉద్యోగుల్లోనూ ఆందోళన నెలకొంది. ఆరోగ్యశ్రీ పథకం తీసివేస్తే తమను కొనసాగిస్తారా? లేదా తీసివేస్తారో? ఏమోనని.

వైద్యం ఖర్చు రూ. 1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు

వైద్యం ఖర్చు రూ.1000 దాటితే చాలు ఆరోగ్యశ్రీ వర్తిస్తుండంతో అధికశాతం మంది ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. గతంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు ఆరోగ్యశ్రీ పథకం ఉండేది కాదు. వాటికి కూడా ఆరోగ్యశ్రీ పథకాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వర్తింపజేసింది. కేన్సర్, గుండెజబ్బులకు ఎన్ని లక్షలు ఖర్చయినా వైద్యం చేయించారు. ఆరోగ్యశ్రీ పథకం లేనప్పుడు, పేద, మధ్యతరగతి వర్గాల వారు అప్పులు చేయడం, ఇల్లుగాని, భూమిగాని తాకట్టు పెట్టుకుని చికిత్స చేయించుకునేవారు.

ఆరోగ్య ఆసరాకు మంగళం

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్సఅనంతరం ఇచ్చే భృతి ఆరోగ్య ఆసరాకు కూడా మంగళం పాడేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ఆరోగ్యశ్రీ రోగులకు ఆరోగ్య ఆసరా కింద డబ్బులు జమ కావడం లేదని రోగులు చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ఆస్పత్రులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులు 28 ఉన్నాయి. గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం ప్రాంతీయ ఆస్పత్రి, ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీ బాడంగి, సీహెచ్‌సీ భోగాపురం, సీహెచ్‌సీ బొబ్బిలి, సీహెచ్‌సీ చీపురుపల్లి, సీహెచ్‌సీ నెల్లిమర్ల ,ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాఆస్పత్రి, అభినవ ఆస్పత్రి (ఎస్.కోట), కొలపర్తి ఆస్పత్రి (ఎస్.కోట), సాయి పీవీఆర్ ఆస్పత్రి (విజయనగరం) శ్రీ సాయి సూపర్ ఆస్పత్రి, వెంకట రామ ఆస్పత్రి, ఆంధ్ర ఆస్పత్రి, మారుతి ఆస్పత్రి, పీజీ స్టార్ ఆస్పత్రి స్వామి ఐ ఆస్పత్రి, మిమ్స్, నెఫ్రాప్లస్, మువ్వ గోపాల ఆస్పత్రి, గాయత్రి, పుష్పగిరి ఆస్పత్రి, తిరుమల మెడికవర్ ఆస్పత్రి, శ్రీనివాస నర్సింగ్ హోమ్, జీఎంఆర్ కేర్ ఆస్పత్రి, అమృత ఆస్పత్రి ఉన్నాయి.

2,50,068 మందికి చికిత్స

జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2019 నుంచి 2023 వరకు 2,50,068మందికి చికిత్స అందించారు. ఇందుకోసం రూ.531.07 కోట్లు వెచ్చించారు. ఏటా 40 వేల నుంచి 60 వేల మంది వరకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ వైర్లపై పవళించిన మందుబాబు..!



ఎం.సింగుపురంలో మద్యం కిక్కుతో విద్యుత్ వైర్లపై పడుకున్న వ్యక్తి

విచ్చల విడిగా మద్యం ఏరులై పారుతుండడంతో కిక్కు తలకెక్కిన మందుబాబుల విన్యాసాలు విడ్డూరంగా ఉంటున్నాయి. పాలకొండ మండలంలోని ఎం.సింగుపురం గ్రామానికి చెందిన ఓ మందుబాబు ఫూటుగా మందు తాగి ఏకంగా విద్యుత్ స్తంభం ఎక్కేందుకు ప్రయత్నించాడు. అది గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి సమీపంలో ఉన్న నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా క్షణాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అప్పటికే సదరు వ్యక్తి పూర్తిగా స్తంభం ఎక్కి విద్యుత్ వైర్లపై పడుకుని హడావిడి సృష్టించాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు నచ్చజెప్పి సురక్షితంగా మందుబాబును కిందికి దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈఘటనపై 100కు సమాచారం అందడంతో ఎస్సై కె.ప్రయోగమూర్తి సూచనలతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే సమస్య పరిష్కారం కావడంతో సదరు వ్యక్తిని పోలీసులు మందలించారు.

-పాలకొండ రూరల్

నిరాశ్రయులకు తోడుగా 'మానవీయత'



నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం బయట నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న సీఐ శంకరరావు, గోవిందరాజులు

- చలిలో వణుకుతున్న అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

చీపురుపల్లి: ఇళ్లల్లో ఉంటూ చలికి వణుకుతూ ఉన్న ప్రస్తుత రోజుల్లో ఏ తోడు నీడ లేక బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆలయాల బయట చలిలో వణుకుతూ ఉన్న నిరాశ్రయులకు తోడు ఎవరు? అలాంటి వారి కోసమే పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తోంది. చలిలో వణుకుతూ నిద్రిస్తున్న నిరాశ్రయులకు 25 ఏళ్లుగా దుప్పట్లు కప్పుతూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా నిరాశ్రయులకు అండగా నిలిచింది మానవీయత సంస్థ. మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం, ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఆరుబయట చలిలో వణుకుతూ నిద్రిస్తున్న 50 మంది నిరాశ్రయులకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శంకరరావు, మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ.గోవిందరాజులు దుప్పట్లు కప్పి వారికి చలి నుంచి రక్షణ కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శంకరరావు మాట్లాడుతూ మానవీయత సంస్థ ఆధ్వర్యంలో చక్కని సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏ ఆధారం లేక చలిలో వణుకుతున్న నిరాశ్రయులకు దుప్పట్లు అందించడం చాలా అవసరమన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం చాలా గొప్ప విషయమని అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన నూతన సంవత్సర వేడుకలు

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసుశాఖ జిల్లావ్యాప్తంగా చేపట్టిన ముందస్తు చర్యలు సత్ఫలితాలిచ్చాయని, నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిసేందుకు సంబంధిత పోలీసు అధికారులు జిల్లావ్యాప్తంగా ముఖ్యమైన కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటుచేయడంతో పాటు, వాహన తనిఖీలు చేపట్టారన్నారు. రాత్రి ఒంటి గంట తర్వాత రహదారులపై ఎవరూ సంచరించకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేసి, రహదారులపై సంచరించే యువతను ఇళ్లకు తరలించామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపైన, మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపైన విస్తృతంగా దాడులు నిర్వహించి, కేసులు నమోదుచేశామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 42 కేసులు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ఐదు కేసులు నమోదుచేయడంతో పాటు, ఎంవి.చట్టం అతిక్రమించిన వారిపై 184 కేసులను నమోదుచేశామని తెలిపారు. గుర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో దత్త ఎస్టేట్‌లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో రైడ్ చేసి 32 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 22 మొబైల్ ఫోన్‌లు, నాలుగు కార్లు, 10 మోటారు సైకిళ్లు, రూ. లక్ష 82 వేల 740 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా ముగిసేందుకు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన భద్రత ఏర్పాట్లను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు. సంబంధిత సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారని వివరించారు.



మయూరి జంక్షన్ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత వాహన తనిఖీలు చేపడుతున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో తోడల్లుళ్ల మృతి

- మరో మహిళ పరిస్థితి విషమం
- మార్టూరు జాతీయ రహదారిపై ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన రాము, గోపిలు

మార్టూరు: నూతన ఏడాది అంతా బాగా జరగాలని తమకు కలిసి వచ్చిన చర్చికి వెళ్తుండగా లారీ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. దీంతో తోడల్లుళ్ల అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని తాతపూడి, దేగరమూడి గ్రామాల మధ్య రహదారిపై సోమవారం జరిగింది. ఈ ఘటనపై మార్టూరు ఏఎస్సై మహబూబ్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన పల్లపు గోపి (29), విజయనగరం జిల్లాకు చెందిన నాగలక్ష్మిని ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నాగలక్ష్మి అక్క ఉమకు పదేళ్ల క్రితం విజయనగరం జిల్లా బాడంగి మండలం పి. వెంకంపేట గ్రామానికి చెందిన కొల్లు రాము (32)తో వివాహం అయ్యింది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అక్కాచెల్లెళ్ల కుటుంబాలు కొన్నేళ్లుగా విజయవాడలోని వాంబే కాలనీలో నివాసం ఉంటూ గ్రానైట్ సంబంధిత పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

కలిసి వచ్చిన చర్చికి వెళ్తూ ప్రమాదం

మృతుడు పల్లపు గోపి మార్టూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో అతనికి గతంలో అద్దంకి మండలం రెడ్డిపాలెం గ్రామంలోని చర్చికి ప్రార్థనల నిమిత్తం వెళ్లే అలవాటు ఉంది. ఈ క్రమంలో నూతన సంవత్సర వేళ ప్రార్థనల కోసం మొత్తం ఎనిమిది మంది బంధువులు కలిసి నాలుగు బైక్‌లపై విజయవాడ నుంచి రెడ్డిపాలెం చర్చికి బయలుదేరారు. ఒక బైక్‌పై రాము అతని భార్య ఉమ, తోడల్లుడు గోపి వెళ్తున్నారు. మరో బైక్‌పై గోపి భార్య నాగలక్ష్మి తన తమ్ముడితో ప్రయాణిస్తోంది. ఈక్రమంలో తాతపూడి, దేగరమూడి గ్రామాల మధ్య రహదారిపై ముందు వెళ్తున్న లారీని దాటే క్రమంలో రాము బైక్‌తో ప్రమాదవశాత్తు లారీ కింద పడిపోయాడు. ప్రమాద తీవ్రతకు రాము తలపగిలి మెదడు రహదారిపై చెల్లాచెదురుగా పడడంతో వాతావరణం అంతా భీతావహంగా మారింది. గోపి సైతం తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తల పగిలి ముక్కు చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం అవుతూ ఫిట్స్‌తో ఉన్న రాము భార్య ఉమను స్థానికుల సమాచారంతో చిలకలూరిపేట 108 సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆమెను అదే వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న మార్టూరు ఏఎస్సై, సిబ్బంది కోటేశ్వరరావు, రాజేష్‌లతో కలిసి ప్రమాదస్థలానికి చేరుకున్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం హైవే సిబ్బంది సహాయంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుడు గోపి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అపస్మారక స్థితికి చేరుకున్న రాము భార్య ఉమ



భర్త, బావల మరణంతో తల్లడిల్లుతున్న గోపి భార్య నాగలక్ష్మి

పైసలు కొట్టు.. విద్యుత్ మీటరు పట్టు..!

- అడిగినంత ఇస్తే ఓకే..లేదంటే చుక్కలు చూపిస్తున్న విద్యుత్ అధికారులు
- విద్యుత్ కనెక్షన్ మంజూరుకు అధిక మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు
- కేటగిరిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన డి.ఈశ్వరమ్మ అనే మహిళ కొద్ది రోజుల క్రితం తన ఇంటికి విద్యుత్ మీటర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అప్లికేషన్ పట్టుకుని మీటరు కోసం విద్యుత్‌శాఖ కార్యాలయానికి వెళ్తే వారు మీటర్ ఇవ్వాలంటే కొంత ఇవ్వాలని సిబ్బంది డిమాండ్ చేశారు. అడిగినంత ఇవ్వలేదని ఆమెకు మీటర్ ఇవ్వలేదు.

- పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో ఉన్న ఓ లేవుట్‌లో ఇల్లు నిర్మిస్తున్న ఓ వ్యక్తికి 11కేవీ లైన్ వేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి రూ.లక్షలు తీసుకుని కనెక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇలా వీరిద్దరే వద్దే కాదు. అనేక మంది దగ్గర నుంచి విద్యుత్‌శాఖ సిబ్బంది అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగినంత ఇచ్చినట్లయితే ఓకే..లేదంటే విద్యుత్ శాఖ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పెట్టే ముప్పుతిప్పలు తట్టుకోలేక వినియోగదారులు వారు అడిగినంత ముట్టజెప్పుతున్నారు. కింది స్థాయి సిబ్బంది దగ్గర నుంచి అధికారుల వరకు అందరూ పైసలు ఇస్తేగాని పనిచేయడం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



విద్యుత్ భవన్

కేటగిరిని బట్టి రేటు

విద్యుత్ కనెక్షన్ కేటగిరిని బట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. కేటగిరి-1 గృహ వినియోగదారులకు అయితే కనెక్షన్ ఇవ్వడానికి రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా వాణిజ్య విభాగాల కేటగిరి-2కు అయితే రూ.10 వేల నుంచి రూ.20 వేలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అయితే రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు, పెద్ద పరిశ్రమలకు అయితే రూ.5 లక్షలు వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా లేఅవుట్‌లు, అపార్ట్‌మెంట్‌లకు కూడా రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

పైసలు ఇవ్వనిదే పనిజరగదనే ఆరోపణలు

విద్యుత్‌శాఖలో చిన్నపాటి పనికి అయినా పైసలు ఇవ్వనిదే పని జరగదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ పోల్స్ మార్చడానికి, విద్యుత్ లైన్ వేయడానికి, విద్యుత్ వైర్లు మార్పు చేయడానికి, కొత్త కనెక్షన్ల మంజూరుకు ఇలా ఏ పనికి అయినా పైసలు ఇస్తేగాని పని చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ నిత్యావసర వస్తువు మాదిరి మారడంతో వినియోగదారుల అవసరాలను ఆ శాఖ సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారు.

డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయవచ్చు

విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లయితే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లయితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. కనెక్షన్ మంజూరులో అలసత్వం వహించిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

మువ్వల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

32మంది జూదరుల అరెస్ట్

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్దనున్న దత్త ఎస్టేట్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 32 మంది జూదరులను అరెస్ట్ చేసి నట్లు ఎస్సై నారాయణ రావు బుధవారం తెలిపారు. జూదరుల దగ్గర నుంచి రూ.లక్ష 82వేల 740 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి


గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో డిసెంబర్ 29న నిర్వహించిన కంది కొత్తల ఉత్సవంలో ప్రమాదవశాత్తు సాంబారు అండాలో పడి తీవ్రంగా కాలిన గాయాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న చెముడు గూడ గ్రామానికి చెందిన ఎస్.రమేష్ (30) బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా ప్రస్తుతం భార్య గర్భిణి. వద్ధాప్యంలో తల్లిదండ్రులు ఉన్నారు. రమేష్ ఒడిశాకు చెందిన ప్రైవేట్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అన్నీ తానై కుటుంబాన్ని పోషించే రమేష్ మృతి చెందడం పట్ల కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం అర్బన్: ఏపీఎన్‌జీఓ జిల్లా కమిటీ రూపొందించిన 2025 వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుధవారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడం గొప్ప విషయం..

విజయనగరం పూల్‌బాగ్: హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాల అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం పెద్ద చెరువు గట్టున విజయసాగర దుర్గా మల్లేశ్వరి అమ్మవారి ఆలయం నిర్మించి, పేదలకు నిత్యాన్నదానం చెయ్యడం గొప్ప విషయమని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు, నూతన సంవత్సరం సందర్భంగా భీశెట్టి దంపతులను హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ సభ్యులు ఆశీర్వదించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు దవడ కొండబాబు, అధ్యక్షురాలు మీనా నాయక్, కార్యదర్శి స్రవంతి నాయక్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



విజయనగరం పూల్‌బాగ్: క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న బాబ్జీ,తదితరులు



విజయనగరం అర్బన్: ఏపీఎన్‌జీఓ జిల్లా కమిటీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్